ఆరడుగుల స్థలమూ కరవే..!

- శ్మశానవాటికకు కొద్దిపాటి పోరంబోకు స్థలమే దిక్కు
- అది కూడా చట్టు నేల కావటంతో పూడ్చలేకపోతున్నామని ఆవేదన
- ఒకరి మృతదేహం పూడ్చిన చోటే మరొకటి పెట్టాల్సిన పరిస్థితి
- అక్కడ గుంత తవ్వితే బయటపడుతున్న పూర్వీకుల అస్థికలు
- వెంటనే స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్న ఎస్సీ కుటుంబాల వారు

పెరికపాడు ఎస్సీ కుటుంబాల అవస్థలు



పెరికపాడు ఎస్సీ కుటుంబీకుల శ్మశానవాటిక

పెరికపాడు (క్రోసూరు): చనిపోయిన తరువాత మనిషిని గౌరవప్రదంగా సాగనంపాలని (అంత్యక్రియలు) ప్రతి ఒక్కరు కోరుకుంటారు. అయితే మృతదేహాన్ని పూడ్చేందుకు సరిపడా స్థలం పూడ్చిన చోటే గోతులు తీయాల్సిన పరిస్థితి. అలా తీస్తున్న గోతుల్లో పూర్వీకుల అస్థికలు కనబడుతుండటం వారిని ఎంతో కలచివేస్తోంది. మనిషి ఎంత కాలం జీవించినా... ఎంత గొప్పగా బతికినా మృతి చెందినపుడు ఆరడుగుల స్థలం కూడా కరవు కావటం మనసును ఎంతగానో కలచివేస్తుంది. ఎటుపోతున్నాం, ఏం సాధించాం అని మన బతుకుపై మనకే అసహ్యం వేస్తుందనటంలో ఏమాత్రం సందేహం లేదు.

అధ్వానంగా ఎస్సీ సామాజిక వర్గీయుల కుటుంబాల పరిస్థితి

మండలంలోని పెరికపాడు గ్రామంలో ఎస్సీ కుటుంబాల ఆవేదన వర్ణనాతీతం. గత 50 సంవత్సరాలుగా శ్మశానానికి ఉన్నది సుమారు అర ఎకరం మాత్రమే. అది కూడా పూర్తిగా చట్టు భూమి, గొయ్యి తవ్వితే చట్టు తగులుతుండడంతో ఉపయోగపడటం లేదు. ఉన్నది కొద్దిపాటి మంచి స్థలం(సుమారు 15 సెంట్లు). ఉన్న దాంట్లోనే మృతదేహం పూడ్చి పెట్టాలంటే ఒకటి పెట్టిన చోటే మరొకటి పూడ్చిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 సంవత్సరాల క్రితం అక్కడి జనాభా తక్కువ. అప్పట్లో ఉన్న కొద్దిపాటి స్థలం సరిపోయింది. కుటుంబాలు పెరిగాయి, కొత్త కుటుంబాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఎస్సీల ఇళ్లు 70 కాగా జనాభా 700 మంది ఉన్నారు. కానీ అదే శ్మశానానికి మాత్ర అదే చాలీచాలని స్థలం. అందులో మృతదేహాన్ని పూడ్చి పెట్టేందుకు వీలుపడటం లేదు. ఎవరైనా చనిపోతే ఒకసారి తీసిన చోటే గోతులు తీస్తుంటే అక్కడ పూర్వీకుల అస్థికలు బయట పడుతున్నాయి. దీంతో మృతదేహం పూడ్చాలంటే ఎంతో బాధపడాల్సి వస్తుందని అక్కడి వారు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తగువిధంగా చర్యలు తీసుకొని వారికి కావాల్సిన శ్మశాన వాటిక కొరకు స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మనిషి చనిపోతే పూడ్చిపెట్టలేకపోతున్నాం



మా ఎస్సీ కుటుంబాలలో మనిషి చనిపోతే పూడ్చిపెట్టేందుకు నాకు తెలిసినప్పటి నుంచి స్థలం లేకుండా పోయింది. ఉన్నదాంట్లోనే ఇప్పటి వరకు అవస్థలు పడుతున్నాం. కనీసం మనిషి చనిపోతే పూడ్చటానికి స్థలం కూడా లేదంటే ఎంత దారుణమో అధికారులు ఆలోచించాలి.

– జడ మరియమ్మ, పెరికపాడు

గతంలో అనేక సార్లు అధికారులను కోరాం



గతంలో శ్మశానవాటికకు స్థలం కావాలని అనేక సార్లు అధికారులను అడగటం జరిగింది. ఉన్న కొద్దిపాటి స్థలంతో మేము అనేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం పరిశీలించి స్థలం కేటాయించాలి.

– జడ సుబ్బు, పెరికపాడు

కార్తిక మాసం.. పరమ పవిత్రం

- నియమ, నిష్టలతో మాలధారులు
- వాడవాడలా అయ్యప్ప, భవానీ, గోవింద, శివ దీక్షాపరులు
- వేకువజాము నుంచే భక్తి గీతాలతో మార్మోగుతున్న పల్లెలు



కోట్లూరు ప్రసన్నాంజనేయ ఆలయం వద్ద మాలధారులు

బెల్లంకొండ: మారుతున్న జీవన స్థితిగతులు, సమాజంలో జరుగుతున్న కనీవినీ ఎరుగని సంఘటనలు, వ్యక్తిలో ఏర్పడుతున్న చెడు భావాలకు దూరంగా ఉండేందుకు దైవ చింతన ఒక్కటే మార్గం. దైవ చింతనకు ప్రధాన మార్గం మాలధారణ. పరమ పవిత్రమైన కార్తిక మాసంలో అనేక మంది భక్తి భావంతో అయ్యప్ప, భవానీ, గోవింద, శివ మాలలు ధరించి దీక్షలు చేపడతారు. నియోజకవర్గంలోని మండలాల వ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తులు మాలధారణ గావించారు.

- కొందరు దైవ చింతనతో దీక్షలు చేపడితే, మరికొందరు వ్యక్తిగత అలవాట్లకు స్వస్తి పలికేందుకు దీక్షలు చేపడుతుంటారు. దీనికి అనుగుణంగా తమ ఇష్ట దైవాన్ని కొలిచేందుకు విభిన్న మార్గాలను ఎంచుకుంటారు. మండల కాలం (41 రోజులు) పాటు మాలలు ధరించి, నిత్యం దైవ చింతనతో కఠోర పూజలు నిర్వహిస్తారు.
- అయ్యప్ప మాలధారులు నలుపు రంగు దుస్తులు, శివ మాలధారులు గోధుమ రంగు, దుర్గా మాత మాలధారులు ఎరుపు రంగు, ఆంజనేయ స్వామి మాలధారులు కాషాయరంగు, గోవింద మాలధారులు పసుపు రంగు వస్త్రాలను ధరించడం ఆనవాయితీగా వస్తోంది.
- ఆయా మాలధారులు ధరించే రంగుల దుస్తులు వారిని నిత్యం దైవ చింతనలో గడిపే విధంగా చేస్తాయి. అంతేకాక భక్తి భావంతో 41 రోజుల దీక్ష ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆహార అలవాట్లలో మార్పు కారణంగా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

17 సార్లు మాల వేసుకున్నా

ఇప్పటి వరకూ 17 సార్లు అయ్యప్పస్వామి మాల వేసుకున్నా. 10 సార్లు పవిత్ర మకర జ్యోతి దర్శనానికి వెళ్లాను. ఏటా క్రమం తప్పకుండా మాల వేసి గ్రామంలోనే కాకుండా, చుట్టు పక్కల గ్రామాల వారికి మాలలు వేయించి, పూజలు చేస్తాం.

– చావలి కొండలు, గురుస్వామి, నాగిరెడ్డిపాలెం

మానసిక ప్రశాంతత దొరుకుతుంది

భక్తి భావంతో మాల వేస్తే మానసిక ప్రశాంతత దొరుకుతుంది. యువతకు చెడు వ్యసనాల వైపు దృష్టి మరలదు. మాలధారుల మనసు నిర్మలంగా ఉంటుంది. అయ్యప్ప మాల వేసిన వారు 45 రోజుల పాటు కఠోర దీక్ష చేపడితే కష్టాలు తొలగిపోతాయి.

– బద్దూరి పిచిరెడ్డి, నాగిరెడ్డిపాలెం

భక్తి భావంతో ఉండాలని

తెలిసో తెలియకో జీవితంలో ఎన్నో తప్పులు చేస్తుంటాం. తప్పులను సరిదిద్దుకునేందుకు, సన్మార్గంలో నడిచేందుకు, అందిరితో స్నేహ భావంతో మెలిగేందుకు దీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని నా నమ్మకం.

– వజ్రాల శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డిపాలెం

వరిలో తెల్ల తెగులు నివారణకు సత్వర చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

నకరికల్లు: వరిలో ఆకుముడత, తెల్లతెగులు పురుగు కన్పిస్తుందని సత్వర నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని చల్లగుండ్ల, అడ్డరోడ్డు గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న వరి పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉన్న వరిలో గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని గోకి తినడం వలన ఆకులు తెల్లగా మారుతున్నాయన్నారు. వరిదుబ్బుకి ఒక లార్వా లేదా రెండు మూడు పురుగులు సోకిన ఆకులు కనిపిస్తే సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. క్లోరోపైరిఫాస్ 500ఎంఎల్ లేదా ఎసిఫేట్ 300 గ్రా. చొప్పున 200లీటర్ల నీటికి కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. రబీలో సాగు చేస్తున్న వరి పంటకు ఎకరాకు రూ.630 చొప్పున చెల్లించి డిసెంబర్ 31వ తేదీలోగా పంట బీమాకు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్‌కుమార్, ఎంపీవో కె.రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

తొండపిలో పొలం పిలుస్తోంది

తొండపి(ముప్పాళ్ల): మండలంలోని తొండపి, రుద్రవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఏఈవోలు నీలిమ, రాజేష్‌లు వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మిరపను ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలను వివరించారు. గులాబీరంగు పురుగు నివారణకు ముందస్తు చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత



ట్రాక్ మరమ్మతులు చేస్తున్న రైల్వే సిబ్బంది

సత్తెనపల్లి: రైల్వే ట్రాక్ మరమ్మతులలో భాగంగా పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో గల రైల్వే గేటును రైల్వే అధికారులు బుధవారం మూసివేశారు. గురువారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అటు వైపు వెళ్లే ప్రజలు మరో మార్గం ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు. దీంతో సత్తెనపల్లి ఆర్టీసీ డిపోవారు అచ్చంపేట, క్రోసూరు, మాదిపాడు, తాళ్లచెరువు, నిండుజర్ల, పెదపాలెం గ్రామాలకు నడపాల్సిన బస్సులను గేటు అవతల నుంచి నడిపారు. ప్రయాణికులు సత్తెనపల్లి నుంచి గేటు వరకు ఆటోలో వెళ్లేందుకు తీవ్ర వ్యయప్రయాసలు పడ్డారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయించే దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపులలో ఉన్న ప్రతి సరుకుకు ఖచ్చితంగా సీపీలు కలిగి ఉండాలన్నారు. సీపీలు లేకుండా ఎరువులు, పురుగు మందులు రైతులకు అమ్మడం చట్టప్రకారం నేరమన్నారు. నిల్వలు, క్రయవిక్రయాల సమాచారం రికార్డులో నమోదు చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో జి.కాశయ్య

నకరికల్లు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎంపీడీవో జి.కాశయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులను అంచనా వేసుకొని నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.పుల్లారావు, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పందుల విహారంతో ప్రజల ఇక్కట్లు



క్రోసూరు: క్రోసూరులో పందులు స్వైరవిహారం చేస్తున్నా పంచాయతీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని ప్రజలు తెలుపుతున్నారు. యథేచ్ఛగా వీధుల్లో, ప్రధాన రహదారుల మీద, ఇళ్ల ముందు తిరుగుతున్నాయి. పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని వాపోతున్నారు. ఇళ్ల ముందే పందులు మలమూత్రాలు విసర్జిస్తున్నాయని, పందుల వల్ల అనారోగ్యాలు ప్రబలుతాయని తెలిసినా వాటి పోషకులు ఊరిలోనే తిప్పుతున్నారని, పారిశుద్ధ్యం గురించి నిత్యం ప్రచారం చేసే పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని, ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు తగు విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు సస్యరక్షణపై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఏడీఏ ఎం.శివకుమారి

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఉపసంచాలకులు ఎం.శివకుమారి పాల్గొని ప్రస్తుతం సాగులో ఉన్న ఖరీఫ్ పంటలైన వరి, పత్తి, మిరప పంటలలో రైతులు పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల గురించి వివరించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7,521 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవలసి ఉంటుందని తెలిపారు. రైతులు పత్తిలో తేమ 12 శాతం మించకుండా చూసుకోవాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. రబీ సీజన్ నుంచి రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించవలసి ఉంటుందని, బ్యాంకులో రుణం తీసుకున్న రైతులకు బ్యాంకు వారు ప్రీమియం మినహాయించుకుని మిగిలిన రుసుము ఇస్తారన్నారు. బ్యాంకు రుణం తీసుకోని రైతులు, కౌలు రైతులు సీఎస్‌సీ సెంటర్ల ద్వారా గానీ, సీఏసీఎస్‌లో గానీ ప్రీమియం చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ రబీ సీజన్‌కు వరి పంటకు క్రాప్ ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుందన్నారు. అధికారులు సాగులో ఉన్న పత్తి, మిరప పంటలను సందర్శించి రైతులకు సస్యరక్షణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.వేణుగోపాల్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

వేపనూనె కషాయంతో మిర్చిలో తెగుళ్లు నివారించవచ్చు

ఏడీఏ హనుమంతరావు



పెదపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు

అచ్చంపేట: మిర్చి పంటలో వచ్చే ఆకుముడత, కాండం తొలిచే పురుగులు, రసం పీల్చే పురుగులు వంటి తెగుళ్లను వేపనూనె కషాయంతో సమూలంగా నశింపచేయవచ్చని ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదపాలెం, మిట్టపాలెం గ్రామాలలో ఆయన మిర్చి పంటలను పరిశీలించారు. రసంపీల్చే పురుగుల ఉధృతిని గమనించి వాటి నివారణకు రైతులకు సూచనలిచ్చారు. వేపనూనె కషాయాన్ని రెండు మూడు రోజులకు ఒకసారి మొక్క పూర్తిగా తడిచే వరకు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీఏ ఎం.శివకుమారి, ఏవో వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగమణి, మాన్యనాయక్, రహీం, మణి, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో మద్యం షాపును తొలగించాలి



రాజుపాలెం: ఇళ్ల మధ్యలో ఉన్న మద్యం షాపును తీసివేయాలని మహిళలు బుధవారం షాపు ముందు ధర్నా నిర్వహించారు. మందు బాబులు మద్యం తాగి ఇళ్ల ముందే మలవిసర్జన చేస్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచే మందుబాబుల వీరంగం చూడలేకపోతున్నామని మహిళలు తెలిపారు. షాపుకు సమీపంలోనే పాఠశాల కూడా ఉందని, బాలికలు, ఉపాధ్యాయులు మద్యం షాపు ముందు నుంచే వెళ్లాల్సి ఉందని, మద్యం బాబులు వీరంగం చూసి భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. గతంలో కూడా షాపు యజమానుల దృష్టికి తీసుకెళితే రెండు, మూడు రోజులలో షాపును తరలిస్తామని చెప్పి తరలించలేదని, నిర్వాహకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహిస్తున్నారని మహిళలు ఆరోపించారు. అనంతరం తహసీల్దారు దుర్గేష్ రావుకు, స్థానిక ఎస్‌ఐ వేణుగోపాలరావుకు వినతి పత్రం అందించారు. తహసీల్దారు, ఎస్‌ఐ మాట్లాడుతూ షాపును అక్కడి నుంచి తరలిస్తామని భరోసా ఇచ్చినట్లు వారు తెలిపారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి: గంజాయి ఉందనే సమాచారం పట్టణ ఎస్‌ఐ ఎం.పవన్‌కుమార్‌కు అందడంతో బుధవారం పట్టణ పోలీసులు పట్టణంలోని రంగా కాలనీలో తనిఖీలు చేపట్టి రెండు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు బుధవారం తెలిపారు. పట్టణంలోని భీమవరం వెళ్లే దారిలో రంగా కాలనీకి చెందిన తన్నీరు అనమయ్య ఇంటి వద్దకు తనిఖీల నిమిత్తం వెళ్లగా అనమయ్యతో పాటు విశాఖపట్నం జిల్లా చినభూపాలపట్నం గ్రామానికి చెందిన గోడె అప్పన్నలను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచామన్నారు. దాడి చేసిన వారిలో పట్టణ సీఐ బ్రహ్మయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి



రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: ఉచిత వైద్య సేవలను రుగ్మతలతో బాధపడేవారు వినియోగించుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురాంనగర్‌లో గుంటూరు అమృత హాస్పిటల్ వారిచే నిర్వహించబడిన మోకాళ్ల మార్పిడి సర్జరీలకు రిజిస్ట్రేషన్లు, మెగా వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ అమృత వైద్యశాల వారు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉచితంగా మోకాలు మార్పిడి సర్జరీల శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు అభినందించారు. ఈ సందర్భంగా పలువురికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఆడిట్ సీఆర్‌పీఎస్‌లకు శిక్షణ



మాట్లాడుతున్న వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలు నాయక్

క్రోసూరు: క్రోసూరు మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఆడిట్ సీఆర్‌పీఎస్‌లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలు నాయక్ పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, గ్రూప్ సమావేశాలకు అందరు హాజరవ్వాలని, పుస్తకాలను రాయించుకోవాలని, ఆర్థిక లావాదేవీల పట్ల సభ్యులందరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆడిట్ సభ్యులు అందరికీ వివరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎం కృపావేణి, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ నాగూర్, ఏపీఎం ఐబీసీబీ ఇన్‌చార్జి సుబ్బారావు, సీసీలు సదా, నరసింహారావు, సుభాని, నాగరాజకుమారి పాల్గొన్నారు.

మెడికల్ దుకాణాలలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు

సత్తెనపల్లి: పట్టణంలోని పలు మెడికల్ దుకాణాలపై గుంటూరు, నరసరావుపేటలకు చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, సునీతలు బుధవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో గార్లపాడు బస్టాండ్ సెంటర్‌లోని పలు దుకాణాలలో తనిఖీలు చేపట్టి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. వారితో పాటు విజిలెన్స్ అధికారులు కూడా ఉన్నారు.

క్లుప్తంగా

గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు

బెల్లంకొండ: గర్భిణులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కోటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశు సంరక్షణ కార్డులపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ బిడ్డకు ఏ వయస్సులో ఏ టీకా వేయించాలో అవగాహన ఉంటే వ్యాధుల నుంచి బిడ్డను కాపాడుకోవచ్చని తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర అంశాలపై ఆరోగ్య కేంద్రాలలో వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బీజేపీ సంస్థాగత సమావేశం



అమరావతి: భారతీయ జనతా పార్టీ పల్నాడు జిల్లా సంస్థాగత సమావేశం బుధవారం పల్నాడు జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి పి.వి.కృష్ణారెడ్డి అధ్యక్షతన స్థానిక ప్రైవేటు అతిథి గృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉంటూ కేవలం దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తుందన్నారు. నిస్వార్థ నాయకులు కలిగిన పార్టీ అని ప్రతి ఒక్కరు భారతీయ జనతా పార్టీలో సభ్యులుగా చేరి దేశ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కొక్కెర శ్రీనివాస్, పునుగుల రవిశంకర్, ఎంపీపీ మేకల హనుమంతరావు, జిల్లా కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు, మద్ది ధాత్రినారాయణ, గోరంట్ల సత్యనారాయణ, పరాంకుశం శ్రీనివాసా చార్యులు, గోగినేని వెంకట రమణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తమ్మా వెంగళరెడ్డి, నరసింహారావు, మండల అధ్యక్షులు మేకల వెంకటేశ్వరరావు, పలువురు జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బత్తుల రామకృష్ణ(ఫైల్)

ముప్పాళ్ల: ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బత్తుల రామకృష్ణ(42) మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడు ఇరుకుపాలెం ఎంపీటీసీ బత్తుల విజయలక్ష్మి భర్త. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు. రామకృష్ణ తనకున్న వ్యవసాయ భూమితో పాటు, మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులే ప్రధాన కారణంగా కుటుంబసభ్యులు తెలిపారు.

న్యాయవాది రవికుమార్ మృతి



సత్తెనపల్లి : పట్టణానికి చెందిన న్యాయవాది పూచల రవికుమార్ (48) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అందరితో కలసిమెలసి ఉండే రవికుమార్ మృతి చెందడం బాధాకరమని పలువురు న్యాయవాదులు తెలిపారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ బాధ్యులు మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కర్రలతో దాడి.. వ్యక్తికి గాయాలు

పిడుగురాళ్ల: కర్రలతో దాడి చేసిన సంఘటనలో వ్యక్తికి గాయాలైన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 31వ తేదీన రమావత్తు ప్రవీణ్ నాయక్, రామాంజనేయ నాయక్‌లు గొడవ పడ్డారు. పెద్దల సమక్షంలో గొడవ సద్దుమణిగింది. ఈ క్రమంలో ప్రవీణ్‌నాయక్‌ను మాట్లాడాలని చెప్పి ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణానికి రామాంజనేయ నాయక్ పిలిచాడు. వచ్చిన వెంటనే వడితే సాంబశివనాయక్‌తో కలిసి కర్రలతో దాడి చేయటంతో తలకు గాయాలు అయ్యాయి. బాధితుడు గురజాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాడు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

పిడుగురాళ్ల: పట్టణంలోని 12వ వార్డులో నివాసం ఉంటున్న మున్సిపల్ కార్మికుడు కాండ్రకుంట సీతారామయ్య అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన కుటుంబానికి బుధవారం రూ.15 వేలు మట్టి ఖర్చుల నిమిత్తం అందజేశామని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.